

బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 | సంచిక: 129 | పేజీలు: 4 | ఎడిటర్ : బక్క రవీందర్ | ప్రచురణ: హైదరాబాద్ | ఆదివారం 8 -12-2024 | వెల: 5/రూ -



2లో

# మోదీకిదే నా సవాల్

## తొలి ఏడాదిలో రుణమాఫీ చేశారా? 55 వేల ఉద్యోగాలిచ్చారా?

- చేస్తే చూపించండి.. ఢిల్లీ నడిబజారులో క్షమాపణ చెబుతా: సీఎం రేవంత్‌రెడ్డి
- లేదంటే మా ప్రభుత్వాన్ని అభినందించండి.. ప్రధానిగా మీ గౌరవం పెరుగుతుంది
- నడ్డావి అడ్డగోలు మాటలు.. ఈటల, కిషన్‌రెడ్డి దొంగల సోపతి పట్టొద్దు
- గెలిస్తే ఉప్పొంగడం, ఓడితే కుంగిపోవడం తెలంగాణకు మంచిదా?
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- ఏడాదిగా ప్రతిపక్ష నేత కుర్చీని ఖాళీగా ఉంచడంపై ఏం చెబుతారు..?
- నల్లగొండ ప్రజాపాలన విజయోత్సవ సభలో రేవంత్ ప్రశ్న
- నల్లగొండ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

నల్లగొండ: గత 75 ఏళ్లలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రభుత్వం, ఏ సీఎం కూడా తొలి ఏడాదిలోనే 55,143 ఉద్యోగాలు ఇవ్వలేదని.. దీనిపై తాను సూటిగా ప్రధాని మోదీకే సవాల్ విసురుతున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మోదీ పాలనలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా మొదటి ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇస్తే లెక్క చూపాలని... ఢిల్లీ నడిబజార్‌లో క్షమాపణ చెప్పి తలవంచుకొని వస్తానని సవాల్ చేశారు. గెలిస్తే ఉప్పొంగడం, ఓడిపోతే కుంగిపోవడం తెలంగాణ సమాజానికి, ప్రజాస్వామ్యానికి మంచిదా, కేసీఆర్ ఎందుకు బయటికి రావడం లేదని సీఎం ప్రశ్నించారు.

# విశాఖ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్



- నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తాం
- అనేక కీలక సంస్థలు రాబోతున్నాయి
- మెట్రో రైలు డీపీఆర్‌ను ఆమోదించి కేంద్రానికి పంపించాం
- రైల్వే జోన్ భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం
- స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం
- సీప్లేన్ నడిపేందుకు గల అవకాశాలు పరిశీలన
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు


విశాఖపట్నం:విశాఖ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా విజన్ డాక్యు మెంట్‌ను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 'డీప్ టెక్నాలజీ'పై శుక్రవారం నోవాటెల్ హెూటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు అనంతరం మీడియాతో మాట్లాడారు. విజన్-2047లో భాగంగా విశాఖ కోసం ప్రత్యేకంగా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నట్టు సీఎం తెలిపారు. విశాఖను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖ మెట్రో రైల్ డీపీఆర్‌ను ఆమోదించి కేంద్రానికి పంపించినట్టు చెప్పారు.

2లో

# టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

- నైపుణ్యం గల యువతకు అపార అవకాశాలు
- హ్యూమన్ బ్రెయిన్ డెవలప్ చేస్తున్న ఎలాన్ మస్క్
- అటువంటి ఆవిష్కరణలతో భవిష్యత్తులో ఊహించిన మార్పులు
- అంతర్జాతీయ ఎకానమీలో కీలకంగా మారిన భారత్
- పూర్వ విద్యార్థుల సంఘ వ్యవస్థాపక చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు

2లో



## ఏపీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు

- హైకోర్టు తీర్పుతో ప్రభుత్వం కీలక నిర్ణయం
- ముందస్తు నోటీసులివ్వాలని ఉద్యోగ సంఘాల డిమాండ్

## రాష్ట్రవ్యాప్తంగా టీచర్,పేరెంట్స్ మీటింగ్

- కడప ఇంత అధ్వాన్నంగా ఉందా
- డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఆశ్చర్యం

2లో



2లో

# కోల్పోయింది అధికారమే.. పోరాటతత్వం కాదు!

- ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పుతాం
- గడిచిన ఏడాది బీఆర్ఎస్‌కు అత్యంత గడ్డుకాలం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు
- ఏడాది కాంగ్రెస్ పాలనపై షార్ట్ ఫిల్మ్ విడుదల

# ఇది గారడీ సర్కార్

- కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ధ్వజం
- అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కి ఒక్క హామీనీ నిలబెట్టుకోలేదని మండిపాటు
- తెలంగాణకు బీజేపీయే ఉజ్వల భవిష్యత్తు అందించగలదని వ్యాఖ్య
- హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో బహిరంగ సభలో ప్రసంగం



2లో



# కాంగ్రెస్‌పై కత్తులు!

- ఇండియా కూటమిలో లుకలుకలు
- కాంగ్రెస్ తీరుపై భాగస్వాముల్లో తీవ్ర ఆగ్రహం
- సారథ్యం మరొకరికి అప్పగించాలని డిమాండ్లు
- తాను సిద్ధమన్న దీదీ వ్యాఖ్యలపై కలకలం
- మమతకు మద్దతు ప్రకటించిన సమాజ్‌వాదీ
- కూటమిలో విభేదాలు నిజమేనని వ్యాఖ్యలు
- మమత వ్యాఖ్యలు పెద్ద జోక్: కాంగ్రెస్

# టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నం:ఆధునిక టెక్నాలజీతో ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసు కుంటున్నాయని, ఆ మార్పుల కారణంగా వస్తున్న అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పిలుపునిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం సాయంత్రం ఆర్కే బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన యువతకు మంచి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నిర్మాణ రంగంలో కార్మికులు దొరకడం సమస్యగా మారిందన్నారు. ఏసీ రూముల్లో కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసేందుకే యువత ఆసక్తి చూపిస్తుండడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. ఎలాన్ మస్క్ హ్యూమన్ బ్రెయిన్ డెవలప్ చేస్తున్నారని, ఇటువంటి ఆవిష్కరణలతో ఊహించిన మార్పులు భవిష్యత్తులో చోటుచేసుకుంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంతాన ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతోందని, ఇది కొంత ఇబ్బందికర అంశంగా ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతోందన్నారు. టెక్నాలజీ వల్ల అనేక రంగాల్లో ఊహించని రీతిలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అద్భుతమైన రీతిలో ఏఐను వినియోగించి అనేక పనులు చేస్తున్నారన్నారు. ఏ దేశానికి, నగరానికి అయినా ఎయిర్‌పోర్టులు ఎంట్రీ పాయింట్ వంటివని, ఎయిర్‌పోర్టు బాగుంటే ఆ దేశం, ఆ నగరం బాగున్నట్టేనన్నారు.పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్, జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా నినాదాలతో భారత్ ఎకానమీ జోరుగా వృద్ధి చెందుతోందన్నారు. 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవరిస్తుందని స్పష్టంచేశారు.

## ఏపీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ) మేల్స్‌గా దాదాపు 15 నుంచి 22 ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ ప్రారంభం అయింది. 2002, 2003, 2007 ఇలా వివిధ దఫాలుగా రిక్రూట్‌మెంట్‌లో డీఎస్సీ సెలక్షన్ కమిటీ ద్వారా హెల్త్ అసిస్టెంట్లుగా ఎంపిక అయ్యారు. 2013లో జీవో నెంబర్ 1207 ద్వారా వీరిని ఉద్యోగులుగా గుర్తించారు. తొలుత ఎంపిక అయిన 1,000 మందిని, ఆ తరువాత కాలంలో ఈ జీవో ఆధారంగా ప్రభుత్వం నియమించిన మరో 600 మంది జీవితాలు ఇప్పుడు అగమ్యగోచరంగా మారాయి. హైకోర్టు తీర్పు మేరకు ఈ 1,600 మందిని విధుల నుంచి తొలగించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో)లను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రజారోగ్య డైరెక్టర్ పద్మావతి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో డీఎంహెచ్‌వోలు కూడా ఆ ఉత్తర్వులు ఉద్యోగులకు పంపారు. ఇప్పటికే ప్రకాశం జిల్లాలో 75 మంది, నెల్లూరు జిల్లా 164 మంది ఉద్యోగులను తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదే పరంపర ఇతర జిల్లాల్లో కూడా కొనసాగుతోంది. అయితే ఈ ఉద్యోగుల్లో ఎక్కువ మంది 45-50 ఏళ్ల వయస్సు మధ్య ఉన్నవారే ఎక్కువ మంది ఉన్నారు. అయితే హైకోర్టు తీర్పును అమలు చేయడానికి మూడు నెలల సమయం ఉందని, కానీ వారం కూడా తిరగకుండా హడావుడిగా ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేయడానికి అవకాశం ఉందని, ఈ విషయం ప్రభుత్వం ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు.

## కోల్పోయింది అధికారమే.. పోరాటతత్వం కాదు!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ కోల్పోయింది అధికారాన్ని మాత్రమేనని.. పోరాటతత్వాన్ని కాదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు అభిమానం ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే పనిచేస్తామని స్పష్టంచేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దర్శకత్వం వహించి, నిర్మించిన 'నమ్మి నానబోస్తే' షార్ట్ ఫిల్మ్‌తో పాటు కాంగ్రెస్ పాలనపై రూపొందించిన 'అంతా ఉత్తదే' పాటను కేటీఆర్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి బీఆర్ఎస్ పార్టీ 24 ఏళ్లు పూర్తి చేసు కుని 25వ ఏట అడుగుపెడుతోంది. గడిచిన ఏడాది పార్టీకి అత్యంత గడ్డుకాలం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, కేసీఆర్ తుంటి ఎముకకు గాయం, ఎమ్మెల్సీ కవిత అరెస్టు, లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం వంటి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. బీఆర్ఎస్ తరపున గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ నేతల అరెస్టులకు కుట్రలు జరుగుతు న్నాయి. ఈ పరిణామాలన్నీ దాటుకుంటూ బీఆర్ఎస్ తిరిగి బలంగా నిలబడింది. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదినే వ్యతిరేకత మూటగట్టుకుంది. ఉపఎన్నిక జరిగితే పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా గెలవరు' అని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ బోసిపోతుండగా.. విపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ తెలంగాణ భవన్ మాత్రం నిత్యం కళకళలాడుతోందని తెలిపారు.

## విశాఖ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కాబోతోందని, భవన నిర్మాణ ప్రక్రియ త్వరలో మొదలవుతుందన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. విశాఖకు కూడా సీ ప్లేన్ అనుకూలతను పరిశీలిస్తున్నామని వివరించారు. రానున్న రోజుల్లో విశాఖ నగరం అన్ని రంగాల్లోనూ ముందుండేలా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. తనపై విశాఖ ప్రజలు ఎంతో నమ్మకాన్ని ఉంచి ఆదరించా రన్నారు. ఇక్కడి ప్రజలు ఎంతో మంచివాళ్లని, టీడీపీపై ఎంతో అభిమానాన్ని కలిగి ఉన్నారన్నారు. విశాఖ వాసులు కమిటెడ్‌గా ఉంటారన్నారు. తాను ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలను చూశానని, ఇటువంటి భిన్నమైన నగరాన్ని ఎక్కడా చూడలేదన్నారు. మంచి, చెడులను గమనించి నిర్ణయాలు తీసుకోవడంలో ఇక్కడి ప్రజలు ముందుంటారన్నారు. ఒకప్పుడు ఐటీని ప్రమోట్ చేశామని, ఇప్పుడు డీప్ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నా మన్నారు.

# కాంగ్రెస్‌పై కత్తులు!

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో వరుస పరాజయాల నేపథ్యంలో విపక్ష 'ఇండియా' కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. కూటమి పార్టీలకు పరస్పరం పొసగడం లేదు. కూటమి భవిష్యత్తు గురించి కొత్త చర్చ మొదలైంది. కూటమిలో అతి పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ తీరు పట్ల మిత్రపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నేతలు గొంతు విప్పుతున్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఒకడుగు ముందుకేసి మహారాష్ట్రలో కాంగ్రెస్ సారథ్యంలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏస్) నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించింది! అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చకు ఇండియా పక్షాలు చేస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ పాల్గొనడం లేదు. ఇతర అంశాల్లోనూ భాగస్వాముల మధ్య ఏకాభిప్రాయం కనిపించడం లేదు. పార్లమెంట్ లోపల, బయట కలిసి ఒక్కతాటిపై పని చేస్తున్న దాఖలాలు లేవు. ప్రధానంగా హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూటమిలో విభేదాలు తారస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఆధిపత్యాన్ని కొందరు నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాభిమానం కోల్పోయి బలహీనపడుతున్న కాంగ్రెస్ విపక్ష కూటమిని ముందుకు నడిపించలేదని కుండబద్దలు కొడుతున్నారు. సారథ్యం నుంచి కాంగ్రెస్ తప్పుకుని సమర్థులకు బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధమన్న పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ వ్యాఖ్యలు కూటమిలో కలకలం రేపాయి. ఇండియా కూటమికి ప్రస్తుతం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చైర్‌పర్సన్‌గా ఉన్నారు.

**ఇదేనా పొత్తు ధర్మం?**

బీజేపీ హఠావో.. దేశ్ బచావో నినాదంతో లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023 జూన్‌లో 17 పార్టీలతో ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) ఫ్రంట్ ఏర్పాటైంది. బీజేపీని వ్యతిరేకించే పార్టీలు ఒకే వేదికపైకి చేరాయి. కాంగ్రెస్‌తో పాటు భావసారూప్యం కలిగిన పార్టీలు చేతులు కలిపాయి. అయితే, బీజేపీ ఓటమే లక్ష్యంగా ఇండియా కూటమి ఏర్పాటుకు చొరవ తీసుకున్న జేడీ(యూ) చీఫ్, బిహార్ సీఎం నితీశ్ కుమార్ తర్వాత బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలో చేరిపోయారు! ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా పక్షాలు కొన్నిచోట్ల కలివిడిగా, మరికొన్ని రాష్ట్రాల్లో విడివిడిగా పోటీచేశాయి. అంతిమంగా పరాజయమే మిగిలింది. లోక్‌సభలో స్వీయ బలం పెరగడం ఒక్కటే కాంగ్రెస్‌కు కొంత ఊరట కలిగించింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణాలో



మిత్రపక్షాలను పక్కనపెట్టి దాదాపుగా ఒంటరిగా పోటీచేయడం వికటించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌వి ఒంటెత్తు పోకడలంటూ భాగస్వామ్య పార్టీలు మండిపడుతున్నాయి. అందరినీ కలుపుకొని వెళ్లడం లేదని, పొత్తుధర్మం పాటించడంలేదని ఆక్షేపిస్తున్నాయి. అన్ని వైపులా ఒత్తిడి పెరుగుతుండడంతో కాంగ్రెస్ ఏం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

**కాంగ్రెస్ ఆత్మవిమర్శ చేసుకోవాలి**

సమాజ్‌వాదీ ఇప్పటికీ ఇండియా కూటమిలోనే ఉందని ఆ పార్టీ ఎంపీ జావెద్ అలీఖాన్ చెప్పారు. అయితే కూటమిలో అభిప్రాయభేదాలు నిజమేనని అంగీకరించారు. లుకలుకలపై కాంగ్రెసే స్పందించి భాగస్వాములను సమాధానపరచాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సూచించారు. మిత్రపక్షాలను లెక్క చేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే ఇక కూటమి ఎందుకని ప్రశ్నించారు. "అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వల్ల సీట్ల పంపకం సక్రమంగా జరగలేదు, అందుకే అవమానాలు ఎదురయ్యాయి" అని ఆరోపించారు.కూటమి ఒక్కటిగా కలిసి ఉంటుందన్న నమ్మకం తమకు లేదని, ఏ క్షణమైనా అది ముక్కలయ్యే అవకాశం ఉందని జేడీ(యూ) సీనియర్ నేత రాజీవ్ రంజన్ వ్యాఖ్యానించారు. కూటమికి ఎవరు సారథ్యం వహించాలో త్వరలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ తెలిపారు. సారథ్యానికి సిద్ధమన్న మమత ప్రతిపాదనపై దృష్టి పెట్టాలని సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఉదయ్‌వీర్ సింగ్ కోరారు. ఆమెకు తమ మద్దతు, సహకారం ఉంటాయని స్పష్టంచేశారు. కాంగ్రెస్ మాత్రం మమత వ్యాఖ్యలపై గుర్రుగా ఉంది.

# మోదీకిదే నా సవాల్

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్యానించారు. శనివారం సాయంత్రం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గంధంవారిగూడెంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే... "కేసీఆర్, బీఆర్ఎస్ వారు మాట్లాడిన ప్రెస్‌మీట్ల కాగితాలు తీసుకెళ్లి ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి అవే నకలు కొడుతున్నారు. కిషన్‌రెడ్డి, ఈటల మారాలి. ఆ దొంగల సోపతి పడితే మీరు కూడా దొంగల బండి ఎక్కుతారు. అటే పోతారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా.. అడ్డగోలుగా మాట్లాడవద్దు. ఏది పడితే, ఎలా పడితే అలా మాట్లాడితే చెల్లదు. మీరు కేసీఆర్‌లా తయారుకాకండి. మోదీ పాలనలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా మొదటి ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇస్తే లెక్క చూపండి. మోదీకి సవాల్ చేస్తున్నా.. ఢిల్లీ నడిబజార్‌లో మీకు క్షమాపణ చెప్పి తలవంచుకొని వస్తా. లేకపోతే నా లెక్క అప్పజెబుతా. మీ నాయకులు, మీరు తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించండి. అప్పుడే ఈ దేశ ప్రధానమంత్రిగా మీ గౌరవం పెరుగుతుంది. అంతేకాదు మేం తొలి ఏడాదే 25.50 లక్షల మంది రైతుల రుణమాఫీ చేశాం. రూ.21 వేల కోట్లు వారి ఖాతాల్లో వేశాం. మోదీ, కేసీఆర్ మీరు ఎప్పుడైనా చేశారా? సవాల్ విసురుతున్నా. మోదీ అధికారంలో ఉన్నప్పుడైనా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనైనా ఒక్క ఏడాదిలోనే ఇలా రుణమాఫీ చేస్తే.. నేను మా మంత్రులతో సహా వచ్చి క్షమాపణ చెబుతాం. కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోండి.. గెలిస్తే ఉప్పొంగడం, ఓడిపోతే కుంగిపోవడం తెలంగాణ సమాజానికి, ప్రజాస్వామ్యానికి మంచిదా? కేసీఆర్ ఎందుకు బయటికి రావడం లేదు? ఎందుకు మాట్లాడటం లేదు? అధికారంలో ఉంటే చలాయిస్తాం, ఓడిపోతే ఫామ్‌హౌస్‌లో పడుకుంటామంటే ఎలా? దీనిపై ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? మేం ఎన్నికల్లో పోటీ చేయలేదా? ఓడినా, గెలిచినా ప్రజల్లో ఉండలేదా? రెండుసార్లు మీరు గెలిచారు. మేం ఓడిపోయాం.. అయినా జానారెడ్డిలాంటి పెద్దలు ప్రజల్లో ఉండి, అసెంబ్లీలో పాలకపక్షానికి సూచనలు, సలహాలు ఇస్తూ, తప్పిదాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు.మా ఎమ్మెల్యేలను గుంజుకున్నా, సీఎల్పీ హోదాను తొలగించినా మొక్కవోని ధైర్యంలో భట్టి విక్రమార్క కొట్లాడారు. ఇప్పుడు సంవత్సరం పూర్తయినా మీరు ప్రతిపక్ష నాయకుడిగా మీ పాత్ర పోషించారా? అసెంబ్లీకి వచ్చారా? ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, టీఆర్ఎస్ అధ్యక్షుడిగా, పదేళ్లు సీఎంగా మీకున్న అనుభవాన్ని, మీ వయసును తెలంగాణ ప్రజల కోసం ఏ ఒక్కరోజైనా వినియోగించారా? ఆలోచించాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కుర్చీ ఖాళీగా ఉంచడం పట్ల తెలంగాణ సమాజానికి ఏం సమాధానం చెబుతారు? ప్రభుత్వ నిర్ణయాలు మీకు నచ్చకపోతే, ప్రజలకు కష్టం వస్తే ప్రజలపక్షాన మాట్లాడాల్సింది పోయి ఒక గాలి బ్యాచ్‌ను తయారు చేసి ఊరి మీదికి వదిలారు. వారేం మాట్లాడుతున్నారో, ఏం చేస్తున్నారో ఎప్పుడైనా విన్నారా? ప్రతి అభివృద్ధి పనిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు ఇవ్వొద్దన్నప్పుడు, గ్రూప్%-%4, గ్రూప్%-%1 పరీక్షలు పెట్టవద్దన్నప్పుడు, డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేయాలన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా ముందుకు వెళుతుంది? కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉంటే.. కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పుతో మాకు అప్పగించారు. అప్పులకు ప్రతి నెలా రూ.6,500 కోట్ల చొప్పున ఏడాదికి రూ.65 వేల కోట్లు వడ్డీ కట్టాల్సి వస్తోంది. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఔటర్ రింగ్ రోడ్డు వేశారు. ఇప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా రీజనల్ రింగు రోడ్డు తీసుకువచ్చి అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటాం. 50వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీగా కొత్త నగరాన్ని నిర్మించుకుని, పెట్టుబడులు తెచ్చి.. నిరుద్యోగులకు, ఇంజనీర్లకు, డాక్టర్లకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత మాదే.

## ఇది గారడీ సర్కార్

హైదరాబాద్: రాష్ట్రంలో గారడీ ప్రభుత్వం కొనసాగుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మండిపడ్డారు. ఆచరణ సాధ్యంకాని హామీ లిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. ఏడాది నుంచి ప్రజల్ని వంచిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఏడాది పాలనంతా గత బీఆర్ఎస్ పాలనకు నకలుగా ఉందని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో 'కాంగ్రెస్ ఏడాది పాలన%-%వైఫల్యాలపై బీజేపీ నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ నడ్డా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.'తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ పరిస్థితు లను చూస్తే కాంగ్రెస్ వైఖరి స్పష్టమవుతుంది. పాత పెన్షన్ స్కీం జాడలేదు. 2 లక్షల ఉద్యోగాల ఊసులేదు. మహిళలకు ప్రతి నెలా ఇస్తామన్న రూ. 2,500 ఏ ఒక్కరికీ అందలేదు. ఆటోడ్రైవర్లకు రూ. 12 వేల హామీ ఏమైంది? రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, కౌలు రైతులకు రూ. 12 వేలు, షాదీ ముబారక్ కింద రూ.లక్ష, తులం బంగారం, విద్యార్థులకు రూ.5 లక్షల క్రెడిట్ కార్డులు, స్కూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు... ఇలా వందల సంఖ్యలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా రేవంత్ ప్రభుత్వం అమలు చేయలేదు. దీనిపై ప్రశ్నించిన మాపై ఎదురుదాడి చేస్తున్నారు' అని నడ్డా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయనపైనే నమ్మకం లేదని.. అందుకే పూటకోమాట చెప్పి ప్రజల్ని ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అప్పులు చేస్తూ మనుగడ సాగించే ప్రభుత్వాలు ఎక్కువకాలం ఉండవంటూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.'కాంగ్రెస్ ఏడాది పాలనను ప్రజల ముందే ఎండగట్టేందుకు ఇక్కడికి వచ్చా. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, ఇప్పుడున్న కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడా లేదు. ఉద్యమాలు చేసి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజలు ఇప్పటికీ మోసపోతూనే ఉన్నారు. మాయమాటలతో రైతులు, మహిళలు, యువకులు, కార్మికులను మోసగించిన కాంగ్రెస్‌పై పోరాడాలని నిర్ణయించాం' అని నడ్డా పేర్కొన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓట్ల శాతం భారీగా పెరిగిందని నడ్డా ఉద్ఘాటించారు. 'దేశంలోని 19 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది.

## రాష్ట్రవ్యాప్తంగా టీచర్,పేరెంట్స్ మీటింగ్

అమరావతి: ఏపీ రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజున శనివారం తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. దేశంలో పెద్ద రాష్ట్రాల్లో ఈ స్థాయిలో సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి. రాష్ట్రవ్యాప్తంగా 45,094 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సీఎం ముచ్చటించడంతో పాటు వారి ప్రగతి నివేదికలు పరిశీలించారు. తర్వాత తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థుల సూచనలు, సలహాలు విన్నారు. సమావేశం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రుల సహపంక్తి భోజనాలకు 23 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు. కడప మున్సిపల్ హైస్కూల్‌కు పవన్ మరోవైపు కడప మున్సిపల్ హైస్కూల్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వచ్చారు. ఆయనకు అధికారులు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులతో పవన్ ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కడపలో పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# చేవెళ్ల లో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

### ప్రత్యేక పూజలలో పాల్గొన్న కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయం చైర్మన్ మధుసుధన్ రెడ్డి

### విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### కాలే యాదయ్య, గ్రంథాలయ చైర్మన్ మధుసుధన్ లను సన్మానించిన చేవెళ్ల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మోత్కుపల్లి మహిపాల్



**శంకర్పల్లి డిసెంబర్ 07:(డైలీ రిపోర్ట్):** చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన మొత్తుకుపల్లి మహిపాల్ శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, మహిపాల్ వారి సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. అనంతరం, కాలే యాదయ్య, మధుసుధన్ చేతులమీదుగా చేవెళ్లలోని కొత్త గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో విశేషంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా, వారు మాట్లాడుతూ, విద్యార్థులకు మంచి వసతులు కల్పించడమే కాక, గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని, చదువులో నైపుణ్యం పొందాలని అభిప్రాయపడ్డారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు ఉపయోగించి, మంచి చదువులు అభ్యసించి, తమ జీవన విధానాన్ని మెరుగుపరచుకోవాలని ఆయన సూచించారు. అలాగే, సమాజంలో ఉన్నత స్థాయిలో రాణించేందుకు ప్రతి యువతీ, యువకుడు తమ శక్తినెన్నిక చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు.



**జోగులాంబ గద్వాల్ జిల్లా యువజన అధ్యక్షుడిగా ఆర్ తిరుమలేష్ ను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన కొండాపురం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చాకలి నరేష్ రమేష్**

నేషనల్ యువజన కాంగ్రెస్ ఎన్నికల భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగినటువంటి ఎన్నికలలో జోగులాంబ గద్వాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆర్ తిరుమలేష్ మరియు కేటి దొడ్డి మండల ఉపాధ్యక్షులు మల్లేష్ విజయం సాధించిన సందర్భంగా విజయోత్సవ సభ లో జిల్లా యువజన అధ్యక్షుడు ఆర్ తిరుమలేష్ ను మరియు కేటి దొడ్డి మండల ఉపాధ్యక్షులు మల్లేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపిన కొండాపురం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చాకలి నరేష్ రమేష్ ఈ కార్యక్రమంలో లో మాజీ ఎంపిటిసి పద్మా రెడ్డి ఈ పద్మా రెడ్డి వడ్డే వెంకటరాములు గోనెల స్వామి తదితరులు పాల్గొన్నారు....

## ఎస్ జిటియు శంకర్‌పల్లి మండల నూతన కార్యవర్గం

**శంకర్‌పల్లి డిసెంబర్ 07:(డైలీ రిపోర్ట్):** ఎస్ జిటియు శంకర్‌పల్లి మండల నూతన కార్యవర్గం శనివారం జిల్లా కన్వీనర్ గణేష్, కో కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయ్యింది. గౌరవ అధ్యక్షులుగా ఆలంఖాన్ గూడ గ్రామానికి చెందిన మొగులయ్య, అధ్యక్షులుగా చందిప్ప గౌండ్ల శ్రీరాములు గౌడ్, వైస్ ప్రెసిడెంట్ లుగా ప్రొద్దుటూరు శ్రీనివాస్, కొండకల్ తాండ రవికాంత్ రెడ్డి, వైస్ మహిళా అధ్యక్షురాలిగా గాజులగూడ విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కొండకల్ తండా బాలరాజ్, అదనపు ప్రధాన కార్యదర్శిగా గణేష్ నగర్ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా చందిప్ప నర్సింహులు, సలహాదారులుగా కొత్తపల్లి హరికుమార్, ప్రొద్దుటూరు సుధాకర్ రెడ్డి, కార్యదర్శులుగా మహారాజ్ పేట్ రియాజుద్దీన్, ఎల్వర్తి మహేందర్, మాసాని గూడ శ్వేత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.





### నిఖిల కన్స్ట్రక్షన్ డెవలపర్స్(ఎన్ సిడి) కి ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికెట్ అందుకున్న ఎండీ శ్రీనివాస్ రావు వెలువోలు

**శంకర్‌పల్లి డిసెంబర్ 07:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధి మోకిల గ్రామంలో నిఖిల కన్స్ట్రక్షన్ డెవలపర్స్ చేపడుతున్న నాణ్యమైన కట్టడాలకు ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికెట్ ను శనివారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ఎన్ సి డి అధినేత శ్రీనివాసరావు వెలువోలు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మెట్రో రైల్ కు వచ్చిన తర్వాత ఎన్ సిడికు ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డు హెచ్ వైఎం ఇంటర్నేషనల్ సంస్థ నుంచి రావడం జరిగిందని, నిఖిల కన్స్ట్రన్స్ డెవలపర్స్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన నిర్మాణం చేపడుతుందని, మోకిలలో శరవేగంగా పూర్తి చేసుకుంటున్న రాయల్ పెవిలియన్ అందుకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్తులో కూడా మా సంస్థ నుంచి అంతర్జాతీయ ప్రమాణలతో కూడిన నిర్మాణాలు చేపడతామన్నారు. ఇప్పటి వరకు ఎన్సిడికి ఐఎస్ఓ 9001:2015 క్వాలిటీ స్టాండర్డ్ సర్టిఫికెట్.ఐఎస్ఓ 14001:2015 ఇన్ విరాన్మెంటల్ స్టాండర్డ్ సర్టిఫికెట్, ఐఎస్ఓ 45001:2018 అకుపేషనల్, సేఫ్టీ స్టాండర్డ్ సర్టిఫికెట్, ఐఎస్ఓ10002:2018 కస్టమర్ సాటిస్ఫేషన్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్ రావడం జరిగిందన్నారు. ఈ సర్టిఫికెట్లు రావడానికి ముఖ్య కారణం క్వాలిటీతో నిర్మాణం చేపట్టడం, సమయానికి ఫ్లాట్స్ అందించడం, పర్యావరణం కాపాడడం, నాణ్యమైన నిర్మాణాలు చేపట్టడం ద్వారా రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీమ్ భరత్ పాల్గొన్నారు.

## శంకర్పల్లి ABVP ఆధ్వర్యం లో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి



**శంకర్పల్లి డిసెంబర్ 07:(డైలీ రిపోర్ట్) :** శుక్రవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శంకర్ పల్లి నగర కార్యదర్శి చెవ్వ నితిన్ ఆధ్వర్యంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు శ్రీ పాండేశ్ కుమార్ మరియు తిరుపతి రెడ్డి భారతరత్నం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్నో అవమానాలు భరిస్తూ చదువుకుంటూ ప్రపంచ మేధావుల్లో ఒకరిగా నిలుస్తూ పేదల పాలిట ఆశాజ్యోతి భవిష్యత్తు కాంతి అసవనత్వమే చీకటిని చీల్చిన వర్గాల్లో జీవితాల్లో వెలుగుల వేకువ అందరూ ప్రపంచ రాజ్యాంగ చరిత్రని అవలోహించిన భారత తొలి న్యాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 1956 డిసెంబర్ 6వ తేదీన మరణించారని తెలిపారు. దేశంలో ఉన్నటువంటి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని నాయకుడిని ఎన్నుకునే విధంగా ఓటు హక్కును దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తూ భారత అభివృద్ధిలో పాలుపంచుకోవడానికి తన వంతుగా కృషి చేశారు. దేశంలో ఉండే విద్యాశాఖ న్యాయశాఖ పోలీస్ వ్యవస్థ వైద్యులు ఏ విధంగా పనిచేయాలని అక్కడ మనకుండే హక్కుల గురించి తెలియజేస్తూ రాజ్యాంగంలో రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు వంశీ,శ్రీధర్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

**జోగులాంబ గద్వాల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్ తిరుమలేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కొండపురం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు**

నేషనల్ కాంగ్రెస్ యువజన ఎన్నికలలో జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడిగా ఆర్.తిరుమలేష్ ఎన్నికైన సందర్భంగా యువజన కాంగ్రెస్ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఆర్.తిరుమలేష్. కేటి దొడ్డి మండల. ఉపాధ్యక్షులు మల్లేష్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన కొండాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తిరుమలేష్ %ఆ% కేటి దొడ్డి మండల ఉపాధ్యక్షులు మల్లేష్ ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లో %జుఇ వీుజ% పద్మ రెడ్డి చాకలి నరేష్ %వీ% పద్మ రెడ్డి వడ్డే వెంకట రాములు గోనెల స్వామి తెలుగు రంగప్ప తదితరులు పాల్గొంటున్నారు.



## విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలోలో రైతు వేదిక




కేటీ దొడ్డి మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు %ఆ% వంట ఏజెన్సీ వారి కు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలోలో రైతు వేదిక కేటీ దొడ్డి యందు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందివంట వారికీ నాణ్యత, మరియు సూచి శుభ్రత పాటించాలని తెలియజేసారు అనంతరం వంట ఏజెన్సీ వారికీ ఆప్రాన్స్, క్యాప్, గ్లౌజ్ లను పంపిణి చేయడం జరిగింది. కేటి దొడ్డి మండల పరిధి లోని వంట ఏజెన్సీ వారికీ ఆప్రాన్స్ ను ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి ఉచితంగా అందజేశారని అందుకు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరావు మరియు కేటీ దొడ్డి మండల పరిధిలోని ఉపాధ్యాయులు ధన్యవాదములు తెలియజేసారు క్యాప్స్ మరియు గ్లౌజ్ లు, మాస్క్ లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర రావ్ గారు సొంత ఖర్చుల తో అందించారు ఈ కార్యక్రమం లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ్ భాస్కర్, చంద్రసేన రెడ్డి, మరియు ప్రధానోపాధ్యాయులు సి ఆర్ పి లు యుగంధర్, శివరాజ్, పాపయ్య మరియు ఎం బి ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.





# కిర్రాకు లవ్వు పుట్టినట్టు..

ధర్మ, ఐశ్వర్య జంటగా నటిస్తున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమాలోని 'బాగి బాగి..' అనే లిరికల్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. శ్రీవసంత్ స్వరపరచిన ఈ గీతాన్ని చంద్రబోస్ రచించగా, జావెద్ అలీ ఆలపించారు. 'సర్రంటు కరెంట్ షాక్ కొట్టినట్లు, నరాలు గుర్రాలై దౌడు తీసినట్లు, బుర్రంత గిర్రంటు సుట్టు తిరిగినట్టు..కిర్రాకు లవ్వు పుట్టినట్టు బాగి బాగి సూడరాదే కొంచెం ఆగి..' అంటూ యూత్‌ఫుల్‌గా ఈ పాట సాగింది. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశామని చిత్ర బృందం పేర్కొంది. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీవసంత్, రచన-దర్శకత్వం: కిరణ్ తిరుమలశెట్టి.



# కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎంపీ మహేష్ కుమార్

**ఏలూరు, డిసెంబరు 7:(డైలీ రిపోర్ట్ ):** నూజివీడులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 8 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన జాబితాలో నూజివీడుకు స్థానం కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర క్యాబినెట్ నిర్ణయంతో జిల్లా విద్యార్థులకు విద్యావకాశాలు అందుబాటులోకి రానున్నాయని ఎంపీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకే సిలబస్ ఉండాలన్న ఉద్దేశంతో కేంద్రీయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఆరు నుంచి పదో తరగతి వరకు, ఒక్కో తరగతికి 50 మంది చొప్పున 250 మందికి చదువుకునే అవకాశం లభిస్తుందని ఎంపీ తెలిపారు. తన విజ్ఞప్తిని మన్నించి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఎంపీ

# 'వికటకవి' ఓ కొత్త అనుభవం




'వికటకవి' వంటి పీరియాడిక్ బ్యాక్‌గ్రౌండ్ సిరీస్‌కు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేయడం ఛాలెంజ్‌గా అనిపించిందని, ఈ సిరీస్ కోసం ఎంతో పరిశోధన చేశానని చెప్పింది గాయత్రి దేవి జోశ్యుల. ఆమె కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేసిన 'వికటకవి' డిటెక్టివ్ వెబ్ సిరీస్ ప్రస్తుతం జీ5లో స్ట్రీమింగ్ అవుతున్నది. నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సందర్భంగా కాస్ట్యూమ్ డిజైనర్ గాయత్రి దేవి జోశ్యుల మాట్లాడుతూ 'నేను చెన్నైలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేశారు. మైక్రోసాఫ్ట్‌వంటి ప్రముఖ కంపెనీలో పనిచేశా. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి సినీరంగం వైపు అడుగులు వేశాను. 'కుడిఎడమైతే' సిరీస్ ద్వారా కాస్ట్యూమ్ డిజైనర్‌గా నా ప్రయాణం మొదలైంది' అని చెప్పింది.'వికటకవి' సిరీస్ విశేషాల గురించి చెబుతూ 'ఇది తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. దీనికోసం 1940లో హైదరాబాద్ ఎలా ఉందో రీసెర్చ్ చేసి తెలుసుకున్నా. 'మాభూమి' సినిమా చూడటం వల్ల అప్పటి ప్రజల వేషధారణ, సంస్కృతిపై ఓ అవగాహన వచ్చింది. మరింత రిఫరెన్స్ కోసం లైబ్రరీలకు వెళ్లి ఆర్టికల్స్ చదివాను. ఆ సమాచారం ఆధారంగా కాస్ట్యూమ్ డిజైన్స్ సిద్ధం చేశా' అని పేర్కొంది. 'వికటకవి' టెక్నికల్‌గా తనకు మంచి ఎక్స్‌పీరియన్స్‌నిచ్చిందని, తదుపరి సతీష్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందిస్తున్న 'మర్మయోగి' వెబ్‌సిరీస్‌తో పాటు 'మానసచోర' అనే సినిమాకు పనిచేస్తున్నానని గాయత్రి దేవి జోశుౄల తెలిపింది.



# ఇలాంటి కేరక్టర్‌ని ఎవరూ ఊహించరు: అలియాభట్

'గంగూభాయ్ కతియావాడీ' తర్వాత సంజయ్‌లీలా బన్సాలీ దర్శకత్వంలో అలియాభట్ చేస్తున్న సినిమా 'లవ్ అండ్ వార్'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతున్నది. అలియా, విక్కీ కౌశల్‌పై కీలక సన్నివేశాలను బన్సాలీ తెరకెక్కిస్తున్నారు. రణబీర్ కపూర్ ఇందులో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా గురించి ఇటీవల అలియా మీడియాతో మాట్లాడింది. 'లవ్ అండ్ వార్' ఓ పిరియాడిక్ డ్రామా.ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే పనిలో ఉన్నారు సంజయ్‌లీలా బన్సాలీ. ప్రేక్షకుల్ని కొన్ని దశాబ్దాల వెనక్కి తీసుకెళ్లనున్నారాయన. ఆయన దర్శకత్వంలో మళ్లీ నటించడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది. ఇలాంటి కేరక్టర్‌ని ఎవరూ ఊహించరు. నటిగా నాలోని కొత్తకోణాన్ని 'గంగూభాయ్' ఆవిష్కరించింది. అలాగే ఈ సినిమాలో కూడా కొత్త అలియాను చూస్తారు. 2026 మార్చి 20 వరకూ వెయిట్ చేయండి.' అంటూ చెప్పుకొచ్చింది అలియాభట్.

# అర్జున్ మహాక్షయ్ పోరాటం



కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్'. వరలక్ష్మీ శరత్‌కుమార్, సునీల్ కీలక పాత్రధారులు. విజయ్ కార్తికేయ దర్శకుడు. కలైపులి ఎస్ ధాను నిర్మాత. ఈ చిత్రం తెలుగులో డిసెంబర్ 25న విడుదల కానుంది. అర్జున్ మహాక్షయ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఇందులో సుదీప్ కనిపించనున్నారని, సుదీప్ నట విశ్వరూపాన్ని ఆవిష్కరించే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. సంయుక్త హోర్నడ్, సుకృతి వాగల్, అనిరుద్ భట్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: శేఖర్‌చంద్ర, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: వి.క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్.

# విడుదలై నెల కూడా కాకుండానే ఓటీటీలోకి వరుణ్ తేజ్ 'మట్కా'



విడుదలై నెల కూడా కాకుండానే ఓటీటీలోకి రాబోతుంది వరుణ్ తేజ్ మట్కా మూవీ. వరుణ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచిన ఈ సినిమా తాజాగా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. మెగా హీరో వరుణ్ తేజ్‌కి ఈ మధ్య అసలు కలిసి రావాట్లేదన్న విషయం తెలిసిందే. అప్పుడెప్పుడో ఫిదా, తొలిప్రేమ సినిమాలతో సాలిడ్ హిట్లు అందుకున్న ఈ కుర్ర హీరో కెరీర్ గ్రాఫ్ సడన్‌గా పడిపోయింది. ఆపరేషన్ వాలంటైన్, గాండీవ ధారి అర్జున, గని సినిమాలతో వరుస డిజాస్టర్‌లను అందుకున్నాడు. ఇప్పుడు మట్కా సినిమాతో తాజాగా మరో డిజాస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ సినిమా ఎంతటి పరజయం అందుకుంది అంటూ కనీసం పెట్టిన బడ్జెట్ కూడా రాకపోవడం విశేషం. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది.ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా డిసెంబర్ 05 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడించింది. పలాస 1978 సినిమాతో హిట్ అందుకున్న కరుణ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. బర్మా నుంచి వైజాగ్‌కు శరణార్థిగా వస్తాడు వాసు (వరుణ్ తేజ్). ఓ హత్య చేసి చిన్నతనంలోనే జైలుకు వెళ్తాడు. అక్కడ రాటు తేలిపోతాడు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707